# ఒక స్వప్నం కోసం

'అతను'....

అతనో కాదో తెలీదు కానీ....

ఆ అతనో కలల వ్యాపారి!

కావల్సిన వాళ్లకి కావల్సిన రంగురంగుల కలలమ్ముతుంటాడు. అమ్మడమే కాదు. చినిగిపోయి మడతలు పడిపోయిన చిత్తు కలల్నీ... ఎవరెవరో పారేసుకున్న కలల్నీ.... ఎవరి దగ్గరో ఎవరో దోచుకున్న కలల్నీ... పోగుచేసి దాచుకుంటాడు కూడా.

ఒక్కో స్వప్నానికి ఒక్కో విలువ. ఒకే విలువున్న రెండు స్వప్నాలు అతని దగ్గర వుండవు. ఈ విశాల ప్రపంచంలో ఎన్ని వేల కోట్ల మస్తిష్కాలు ఉన్నాయో అవి అన్ని వేల కోట్ల స్వప్నాలు కంటాయో... అన్ని వేల కోట్ల స్వప్నాలు 'అతన్ద'గ్గరుంటాయి.

అతని దగ్గర కలలు ఖాళీ కావు... కలల్లేవు అన్నమాట అతని దగ్గర్నించీ రాదు. కారణం అతని దగ్గర కల ఖరీదు చేయాలంటే ఆ కలకి వెలగా యింకో కలనిచ్చిపుచ్చుకోవా ల్సిందే....!

కలకి బదులుగా కల ....

రంగుకి మారుగా ఇంకో రంగు...

బాధకి మారుగా ఇంకో వ్యథ....

మోదానికి ప్రతిగా యింకో చిర్నవ్వు... అలా అనంతంగా అతనింతవరకూ ఎన్ని అర్బు దాల స్వప్నాలతో వ్యాపారం చేశాడో అతనికే తెలీదు...!

అతని స్వప్న విపణీ క్షేత్రం అత్యంత విశాలమై ఆద్యంతరహితంగా భాసిస్తూంటుంది.

కలల గలగలల్లో... గలగల కలలు.... కళలు, కళలు ... ఫెళఫెళ కలలు... కలల ఫెళఫెళలు... సుత్తిమెత్తని కలలు... గుసగుసల కలలు.... హాహాకారాల వికారాల కలలు... విలయాల కలలు.. వినీలాకాశా లంత కలలు...

అడుగు తీసి అడుగేయాంటే ఎవరిదో...? ఎక్కడిదో....? తెలీని ఓ స్వప్నాన్ని తప్పించు కుని అడుగేయాల్సిందే ఆ కలల ప్రాంగ ణంలో...

ఆ స్వప్నాల మార్పిడి ప్రహసనం కూడా వింతగా వుంటుంది.

ఆ కలల ప్రాంగణంలోకడుగుపెట్టిం తర్వాత మనకెక్కడ్జూచినా స్వప్నాలు... కుప్పలు తెప్పలుగా.... గుట్టలు గుట్టలుగా... చెత్తచెత్తగా కనిపిస్తాయి. కానీ అక్కడ అందుబాటులో వున్నా సరే... కలల్ని మాత్రం ఒక నిర్దిష్ట పద్ధతిలో మార్పిడి చేసుకోవాల్సిందే!

ఆ ప్రాంగణంలో లోపలికలా వెళ్తూ వెళ్తూంటే... హఠాత్తుగా ఓ మహాకుడ్యం దర్శనమిస్తుంది. ఆద్యంత రహితంగా ఆ మహాకుడ్యానికావల మనకేమీ కన్పించదు. ఆ కలల బేహారీ కూడా కన్పించడు. అతన్ని చూసిన వాళ్లు ఈ ప్రపంచంలో ఇంతవరకూ ఎవ్వరూ లేరు. ఆ గోడ ప్రక్కనలా... కదలీ కదలక కదుల్తూంటాం. మనం ... మనం కదుల్తున్నామోతెలీదూ!? ఆ మహాకుడ్యమే కదుల్తోందో. తెలీని భ్రమ. అలా మెల్లమెల్లగా మెల మెల్లగా కదుల్తూ కదుల్తూ ...కదుల్తూంటే హఠాత్తుగా ఆ గోడలో ప్రత్యక్ష మౌతుందో గవాక్షం... ఆ గవాక్షం లోంచే మన కలల మార్పిడి....

అతనూ, అతనూ... అని నేనంటూన్నా. ఆ వ్యక్తి ఆ స్వప్న విక్రయదారు స్త్రీయో!? పురుషుడో!? ఎవరికీ తెలియదు. నా వూహకు మాత్రం ఆ వ్యక్తి పురుషుడే.భావ సౌలభ్యం కోసం కూడా. ఈ మహా ప్రపంచం లో ప్రతివ్యక్తీ ఏదో రోజున కలల కోసం ఆ కలల ప్రాంగణానికే వెళ్లకతప్పదు.

నా రోజువారీ స్వప్నాలలో అలుపొచ్చేసింది నాకు.... ఎప్పుడూ చూసే ఫోటోలోని బొమ్మ లాగున కదలనే కదలక.. కొద్దిగా మొహం అటు తిప్పితే బావుంటుందని నేననుకుంటున్నా... ఏ మాత్రం మార్పులేక చట్రాలు పాతవై పోయే కొద్దీ కొత్త చట్రాల్లోకి మారుతూ అవి మాత్రం మారక... నా కలలు నాకు విసుగు తెప్పిస్తున్నాయి.

ఇక తప్పదు నా కలలిచ్చి రెండో, మూడో కొత్త కలలు తీసుకురావాలి.

మనస్సంచీ తీసుకుని... జోబీలో దొరికిన రెండో మూడో పాత కలల్ని మడత పెట్టుకుని... ఆ ప్రాంగణంలోకి ప్రవేశించా.

కలలు.... కలలు

గుట్టలుగా ....పుట్టలుగా.... దారి పొడు గునా.... దారి నిండా... అటూ... యిటూ... ఎటుచూసినా కలలు.

శత సహస్ర మస్తిష్కాల ప్రభవించిన స్వప్నాలు. ఎన్నెన్నో కోట్ల జీవితాలనీ, అనుభవాలనీ వొరుసుకుంటే వచ్చేసిన కలలు... ఎన్ని రంగుల....! యెంత ఖేదం...! యెంత ద్వేషం...!? యెంత నైర్మల్యం....?! యెన్నెన్ని దృశ్యాలు...!? హఠాత్తుగా... నేనెంత జాగ్రత్తగా వున్నా... నా కాలికిందో నలిగిన స్వప్నం. మెల్లగా తీసా... నలిగి, నలిగి... మడతలు, మడతలై పొరలు పొరలై... దుమ్మూ ధూళీ వదిలించి... ఒక్కో మడతా విడదీస్తే...

అరే.... ఆశ్చర్యం...!

ఎప్పుడో గతంలో యుగాల క్రితం... ఏవో నాగరికత దారుల్లో నేనే జారవిడుచుకున్న స్వప్నం... నలిగిపోయి .... నాదే. అవును.... అవునవును నాదే యీ కల... అవున్నిజం.. నిక్కచ్చిగా నాదే యీ కల ... అస్పష్ట బాల్యచేష్ట జ్ఞాపకాల యిబ్బంది. గుర్తొచ్చీ రాక...

పూర్తిగా విడదీసి పరిస్తే... ఆ స్వప్నం నా జీవితమంతా ఆవరించేంతగా వుంది... నా స్వప్నాన్ని నేనే యింకో నా స్వప్నాన్నిచ్చి తీసుకోవాలి.

నిశ్చయించుకొన్నా...

ఆ స్వప్నాన్ని మళ్లీ అలా జారవిడిచి... గోడ కోసం... ఆ మహాకుడ్యం కోసం కదిలా...

ఇంతలో పక్కనున్న ఓ కల నా కెదురుగా తారట్లాడి చిన్నచిన్నగా యేదో తెలీని అస్పష్ట మానవ రూపం సంతరించుకుని... పొడుగ్గా అంగారఖా.... తలకు పాగా. మెరిసే నేత్రద్వయంతో -

"రిహ్లా?" అందా స్వప్నం.

"అర్థం కాలేదు" అన్నా...

"ప్రయాణమా?" అంది ఆ ఆకారం.

"అవును కలల కోసం...."

"కొద్దిసేపు నా వెంట వస్తావా?" అడిగిందా ఆకారం.

"నువ్వెవరూ?"

"కలని"

"తెల్సు, తెల్సు, ఆ మాత్రం తెల్సు. యిక్కడ కలలు గాక యింకేముంటాయి...? నన్ను తడిమి ప్రశ్నిస్తున్నావు కదూ.... అందు కని యే కలవి నువ్వనడుగుతున్నా" అన్నాను.

"బత్తూతా(★) కలని... నిజానికి.... వాస్త వాన్ని! కానీ నేనిప్పుడు కలని... మీ దేశంలో మారుమూల స్త్రైణం నగ్నంగా వుంటుందని బైట ప్రపంచానికి తెలిపింది నేనే... కాసేపు రెండు క్షణాలు నాతోరా... లేదూ... క్షణంలో వెయ్యోవంతు నన్ను స్పృశించు... గమ్మత్తుగా వుంటుంది..." అందా కల.

ఆ స్వప్నాన్ని తాకడానికి చేయి కదిలిం చాలని చూశా... ఈ భూగోళం నా చేతికి వ్రేలాడుతున్నంతగా బరువు...! ... చెయ్యి కదల్దేం...?! అతిప్రయత్నం మీద చిటికెన వ్రేలును మాత్రం కదిలించగలిగా....

"బత్తూతా కలా! బత్తూతా కలా!! నేన్నిన్ను తాకలేను. నువ్వే నన్ను స్పృశించు...." అని అర్థించా.

---

(★) Ibn Batuta famous Arab travellor and writer.

బత్తూతా కల అలవోకగా నన్ను తాకింది. విద్యుత్తు ప్రాకినట్టుగా ఒక్కసారి టాంజియర్నించీ... మక్కాకు... ఈజిప్టు... ఇథియోపియా... పర్షియా... సిరియా... చైనా... ఇండోనేషియా.. మలబారు...

అరే మన్దేశమే.... అదుగో వాడెవడూ....? తెల్లటి అడ్డపంచ. నల్లటి ఒళ్లు...

మళయాలంలో పక్కనున్న వాడితో ఏదో అంటున్నాడు.

"అతె... అతె...." అంటున్నాడింకొకడు. వాళ్లు మళయాళం మాట్లాడుతున్నారు అంటే యిది మన మలబారే. అరే....! అంతలోనే...

అందలూషియా.... తింబక్తూ....?

చటుక్కున మాయమైన బత్తూతా స్వప్నం.

యెవరిదో స్వరం.

"చరిత్ర కల కాదు... ఏ కలకూ చరిత్ర లేదు..."

ఇన్నివేల స్వప్నాల్లో ఏ స్వప్నానిదా గొంతుక...?

ఇంకాస్త ముందుకు... కదిలా...

ఆ ప్రాంగణంలో సుషుప్తి చల్లగా వీస్తోంది. హాయిగా వుంది.

కమ్మటి స్వప్న పరిమళాలు....

మణి ప్రవాళంలో మధుర గానం వినిపి స్తోంది. కులశేఖర తిరునాళ్ గానాల. - కల పరిమళం.

"కులశేఖర మహారాజా!" పిలిచా.

"పద్మనాభ! పద్మనాభా!" అని కలవరి స్తోన్నట్టుగా తిరునాళ్ కల.

"పూవు పూచింది..." ఇంకో కల యిటు పక్క "రమణా" అంటూ "కొలతకు మూరలూ, జానలూ, అడుగుబద్దలూ, గొలుసులూ, అవసరం లేదనీ... ఆ కొలత సరికొత్త కొలతనే..." కలింకొకటి. యంత్ర రక్కసి కోరల్లో చిక్కుకున్న బడుగువాడి ఆవేదనలోంచి ప్రభవించిన వేద స్వప్న మోటి...లోహిత వర్ణంలో...'ట్ అయ్ ట్ ఊ" ప్రకృతి, పురుషుడూ వేరువేరు కాదన్న వృత్తాకార స్వప్నం పక్కన్నే...

'యాన్ యిన్' అని అంటూ!...

యింకాస్త ముందుకి....

నాలుగైదు కలల గుంపు ఒకటి... ఒకో కలతో యింకో కల మాట్లాడుకుంటూ... కలల సంభాషణ.

"ప్లినీ! వెసూవీయస్ విస్ఫోట సుందర దృశ్యాన్ని వివరించవా?"

"కలిగ్యులా పాంపేయీ అంతటి మహాద్భుత నగరాన్ని నేనెరుగను.... అంతటి నాగరికత నాసాంతం నాకేసిన అగ్నిశిఖలు అందంగా వుంటాయా నీకు? ఈ యావత్ప్ర పంచంలో అంత పెద్ద సమాధి యింకోటి లేదు... ఒక సుందర నగర జీవనం యావత్తూ బూడిద గుప్పగా మారిపోయిన ఆ క్షణాన్ని గుర్తు చేయొద్దు... మహారాజా... మరోమాట మాట్లాడితే....పక్క నున్న 'స్పార్టకస్' 'నీటోగా'తో నీకు ఉరేస్తాడు జాగ్రత్త..."

కండలు తిరిగిన స్పార్టకస్ కల అడ్డంగా తలూపుతూ అంది. "నేనిప్పుడు చంపను... మళ్లీ ఒక మహోద్యమంగా జన్మించి,ఈ రాజుల్నందర్నీ నాశనం చేస్తాను" అని చెయ్యెత్తి పిడికిలి బిగించింది...

"గుఱ్ఱప్పాల సారాకన్నా యిదే బాగుంది. మరొక్క కప్పుడు పొయ్యండి. యూరోపు లేపోతే నీ వీపు సాపై యుండేది. ద్రాక్ష నాకు విమోక్ష"... ముద్దముద్దగా అరుస్తూ ఆ గదై కల - "కామవాంఛలు మనం పసిపిల్లలుగా వున్నప్పుడే మనలో మొదలవుతాయి. ఆ విషయమై మనం తీవ్రంగా చర్చించాల్సిన అవసరం మనకుంది."

అని సిగ్మండ్ ఫ్రాయిడ్ కలంది...

"ఛీఃఛీః నీకు మాతృమూర్తి స్తన్య మివ్వడంలోనూ... పురీష విసర్జనంలో కూడా సెక్సే.... యిక నీతో వుండను." అంటూ గస్టావ్‌యంగ్ కల దూరంగా పొగలాగా జరిగిపోయింది.

"కాళిదాసు నిజానికి నాకన్నా మంచికవి ... రాహిత్యంలో సౌందర్యం చూపడం నా వల్ల కాలేదు చూడండి. సుదక్షిణను యెలా వర్ణిస్తున్నాడో...

"శరీర సాదాదసమగ్ర భూషణా ముఖేనసా లక్ష్యత లోధ్ర పాండునా, తను ప్రకాశేన విచేయ తారకా ప్రభాత కల్పా శశినేవ శర్వరీ!!"

వాల్మీకి గొణుక్కుంటూ శ్లోకం పాడు కుంటూ కళ్లు మూసుకున్నాడు.

ఆ తర్వాతింకో పది పన్నెండు కలలు... మానవాకారంలోనే వంటి నిండా గుడ్డ పీలికలు చుట్టుకుని ఏ మాత్రం సందు లేకుండా అన్ని ఆకారాలు ఒక్కలాగే....

"మీరెవరు?" ప్రశ్నించా.

"రామ్‌సేస్..." అన్ని కలలూ ముక్త కంఠంతో పలికారు.

"చాలు చాలు... నాకు తెల్సిపోయింది. మీరంతా ఒక పరిపక్వ స్వప్న శకలాలు. మీకు హృదయ పూర్వక ప్రణామాలు" అని దాటుకున్నా.

నా జేబులో మడతపడిన స్వప్నాలు. తిరగబడతాయోమోనన్న భీతి. తిరగబడినా అవి నన్నేం చేయలేవన్న ధైర్యం కూడా.... అవిక చెల్లుబాటు కాని కలలు.

"తూచ్" అని అనెయ్యవచ్చు.

మళ్లీ ప్రయాణం.

హఠాత్తుగా ఆ ... మహాకుడ్యం

ఆ గోడ ప్రక్కన నిలబడ్డా.

అవతల ఏముంటుంది....?

అది తెలిస్తే... నేనే కలలు అమ్మొచ్చు.

కదులు! కదులు! మనస్సంటోంది.

గోడ వెంబడి..... ఆ పురాతన అద్యంత రహిత మహాకుడ్యం పక్కగా దాన్నీడన అలా అలా కదుల్తూ.....

మెఱపు.

గవాక్షం.

గోడ ఆగిపోయింది....

ఆగిపోయింది గోడా? నేనా?

నేనేనేమో??

కాదు కాదు... గోడే.

గవాక్షం.... అక్షం.... కన్ను తెరచి

"యే కలలు? ఎన్ని?" శబ్దించని భావం... నా స్ఫురణకు మాత్రమే.

"ఒకే ఒక కల... నే సుషుప్తి ఆదిలో తొక్కు కున్న కల... నా పురాతన స్వప్నం" అన్నాను నేను? లేదూ అట్లా భావించానా?

"బదులుగా ఏ కలనిస్తావు?" అనాది నుంచి మనిషి అన్వేషిస్తున్న ఆకార స్వరం.... నాకు మాత్రమే స్ఫురిస్తూ...

"నా చెల్లుబాటు కాని విలువైన ఖాళీ కలలు"

అనుకున్నానా? అన్నానా?

ఆ గవాక్షంలోంచి నలిగిపోయి మడతలు మడతలుగా వున్న నా పురాతన స్వప్నాన్ని యేదో అదృశ్య హస్తం బైట పడేసింది. దాన్ని తాకీ తాకగానే నా జేబులో వున్న కలలు మాయమై పోయాయి. గోడ లేదు...!

గవాక్షం ప్రసక్తే వీలులేదు.

వెనుతిరిగి వస్తుంటే... ప్రాంగణం అంతా ఖాళీగా వుంది.

నేను మాత్రం .... ఆ అతి పురాతన స్వప్నంతో .... ఆ అదృశ్య బెహారీ నాకు అమ్మిన నా కలతో...

ఆ గోడ కవతల ఎవరు? ఎవరది?

అది తెల్సుకోవడానికొచ్చే కొన్ని కోట్ల సంవత్సరాల నించే మనిషి కలలు కంటూ, కొంటూ వెళ్తున్నాడు.

మన కలలని మనకే అమ్మే ఆ గోడ వెనకలి శక్తి యేదో?!

ఖాళీ గదికి మూసిన తలుపులు...!

లోపలికెళ్తే మళ్లీ మూసిన తలుపులు... అవి కూడా తెరిస్తే ఇంకో గది ఖాళీ....!!! మూసిన తలుపులు... మళ్లీ .... మళ్లీ.... ఖాళీ గది...!!! ★

***(రచన ఇంటింటి పత్రిక : జులై 2001)***